దాతృత్వం చాటుకున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్

విశాలాంధ్ర-గుంటూరు : గత 15 సంవత్సరాలకు పైగా విద్య, సాహిత్య, సేవా రంగాలలో తమదైన ముద్ర వేసుకున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ద్వారా చైర్మన్ శ్రీకృష్ణమూర్తి తమ అనాథ, వృద్ధుల, రోగుల, శారీరక, మానసిక వికలాంగుల ఆశ్రమానికి రెండు లక్షల రూపాయలకు పైగా విలువచేసే నిత్యావసరాలు, ఫ్యాన్లు దుప్పట్లు, అందించటం వారి మహోన్నత దాతృత్వానికి నిదర్శనమని కార్మెల్ సేవాసదన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గోతాల స్వామి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, అంకమ్మ రావు, సంతోమీ కరుణాలయ, కార్మెల్ సేవాసదన్, సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరు ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ప్రస్తుత సాంకేతిక యుగంలో మన తెలుగు సంప్రదాయాన్ని మర్చిపోకుండా నేటి విద్యార్థులకు సంక్రాంతి సంబరాలు కళాశాలలో నిర్వహించటం అభినందనీయమని కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు అన్నారు. ప్రత్తిపాడు మండలంలోని యనమదల గ్రామ పరిధిలో గల గుంటూరు ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా, డుడు బసవన్న, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలతో విద్యార్థులు సందడి చేసారు. డైరెక్టర్ గోగినేని సాంబశివరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆటలను గాలి పటాలు, గోళీలు రంగవల్లు పోటీలను నిర్వహించి విద్యార్థులలోని సృజనాత్మకను వెలికితీసి ప్రోత్సహించటం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ కోటయ్య, అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలలో అలరించారు.

అంగన్వాడీల నిరవధిక సమ్మెకు టీడీపీ మద్దతు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలో అంగన్వాడీల నిరవధిక సమ్మెకు టీడీపీ మద్దతు తెలిపింది. మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీల నిరసన శిబిరాన్ని టీడీపీ నాయకులు గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షులు దామర్ల రాజు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో వైసీపీ మీనమేషాలు లెక్కపెడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ రూరల్ అధ్యక్షులు తోట పార్థసారథి, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర సాధికార సమితి కృష్ణ బలిజ సభ్యుడు అన్నం నాగబాబు, టీడీపీ నాయకుడు విన్నకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని రేవేంద్రపాడు హైస్కూల్ లో మండల స్థాయి ఆటల పోటీలను గురువారం ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని అత్యంత ప్రతిభ చూపి జిల్లా స్థాయికి రావాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాతో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీఓ దేవరపల్లి వీరయ్య, గ్రామ సర్పంచి పలుకురి మేరిమ్మ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వడ్డెరలకు ప్రాతినిధ్యం కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో వడ్డెర కులస్తులకు వచ్చే ఎన్నికలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ళ రేవతి కోరారు. స్థానిక వైన్ డీలర్స్ కళ్యాణ మండపంలో గురువారం వడ్డెర రాజకీయ భవిష్యత్ కార్యాచరణ సమావేశం జరిగింది. స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రేవతి మాట్లాడుతూ గతంలో వివిధ జిల్లాల్లో వడ్డెర కులస్తులకు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం కల్పించారని, ఈసారి ఎన్నికల్లో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం కల్పించాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అధ్యక్షులుగా తన్నీరు ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది వడ్డెర కులస్తులు ఉన్నారని, ప్రతి నియోజకవర్గంలో 10 నుంచి 30 వేల మంది వరకు ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బత్తుల వెంకటరమణ, వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి నాయకులు తన్నీరు సాంబయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రజకుల ఆత్మగౌరవం కాపాడేది టీడీపీ మాత్రమే

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో రజకుల ఆత్మగౌరవం కాపాడేది టీడీపీ మాత్రమేనని జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర రజక సాధికార కన్వీనర్ గుర్రపుశాల రామకృష్ణ అధ్యక్షతన రాష్ట్ర టీడీపీ రజక సాధికార సమితి సభ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. శ్రావణ్ కుమార్ మాట్లా డుతూ 2024 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రజకులకు సబ్ ప్లాన్ కింద 36వేల కోట్ల నిధులను కేటాయించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల తర్వాత రజకు లకు టీడీపీ అధినేత పెద్ద పీట వేస్తారని హామీ ఇచ్చారు. వైసీపీ అధి నేతకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాత్రమే రజకులకు సంబం ధించిన సమస్యలు పరిష్కరించాలని గుర్తుకు వస్తాయా అని ప్రశ్నిం చారు. రాబోయే రోజుల్లో వైసీపీ పార్టీకి రజక సంఘాలు తగిన గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు. గుంటూరు తూర్పు ఇన్‌ఛార్జ్ మొహ మ్మద్ నసీర్, తుమ్మేటి మురళి, రాచకొండ నాగేశ్వరరావు, అక్కినపల్లి బాలయ్య, పాదిలి శ్రీను, నడికట్టు రమణ, రాచకొండ లక్ష్మయ్య, గద్దం శ్రీను తదితర రాష్ట్ర, జిల్లా రజక సాధికార సభ్యులు పాల్గొన్నారు.

సిబార్ కళాశాల సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో గల సిబార్ దంత వైద్య కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ పి.రేవతి హాజరై సిబార్ కళాశాల చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దంత వైద్యులుగా ఎదగడం కోసం సిబార్ దంత వైద్య కళాశాలలో ఎంచుకున్నందుకు విద్యార్థులు అందరినీ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రమణారెడ్డి, ప్రకాష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మాట తప్పితే ఫిబ్రవరిలో సమ్మెకు వెళ్ళతాం

– కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : మంత్రులు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించారని, అయితే ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఫిబ్రవరి నుంచి సమ్మె కొనసాగిస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె విజయవంతం అయిన సందర్భంగా కార్మికుల దీక్షా శిబిరం ముగింపు కార్యక్రమం మున్సిపల్ కార్యాలయం వద్ద, వెహికల్ షెడ్ వద్ద గురువారం జరిగింది. ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్య దర్శులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్, మున్సిపల్ యూనియన్ నాయకులు కోట మాల్యాద్రి, బందెల రవికుమార్, చినబోతుల వెంకట్రావు, కోటివీరాంజనేయులు, అంతరాజు రవిశంకర్, సువ ర్ణమ్మ, బాలమ్మ, అంకా లమ్మ, లక్ష్మి, కిషోర్ జేసు దాస్, సద్గుణరావు, దానియేలు, శంకర్, విజయ్‌కుమార్, శీను, రమణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి లతో జరిగిన చర్చలలో రూ.15 వేల వేతనాన్ని రూ.21 వేల మూల వేతనంగా మార్చుకోగలిగామన్నారు. దీంతో పీఆర్సీలో ఫిట్‌మెంట్ కనీసం 30 శాతం ప్రకటిస్తే రూ.6 వేలు వేతనం కార్మికుడికి పెరుగుతుందని చెప్పారు. హెవీ, లైట్ వెహికల్ డ్రైవర్లకు రూ.24 వేల వేతనం వచ్చేలా చేశామని అన్నారు. యూజీడీ, మలేరియా వర్కర్లకు, పార్క్ వర్కర్లకు, స్కిల్డ్, ట్రాక్టర్ క్లీనర్లకు, కెనాల్ వర్కర్స్, టాయిలెట్ వర్కర్లకు ఇలా 10 క్యాటగిరీల వర్కర్లకు వారి వేతనాలకు మూలవేతనం రూ.6 వేలు పెరిగిందన్నారు. ఈ వేతనంపై 12వ పీఆర్సీలో ఫిట్ మెంట్ పెరుగుతుందన్నారు. అలాగే వాటర్ వర్క్స్, బోర్ వెల్, పంప్ ఆపరేటర్స్, లీక్ ఆపరేటర్స్, కంప్యూటర్ అసిస్టెంట్స్, ఎలక్ట్రిషన్స్, లైటింగ్ సెక్షన్స్, మెకానికల్ తదితర సెక్షన్స్ వారిని జీఓ నెం.7లో చేర్చి వారికి 10 రోజులలో ముగ్గురు ఐఏఎస్‌లతో కూడిన కమిటీ వేసి ఆ మేరకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్ ఖాతాలు తెరు స్తామని చెప్పారన్నారు. క్వాలిఫికేషన్ బట్టి నేచర్ ఆఫ్ వర్క్‌లో ఉన్నవారిని ఆ స్థానాల్లో భర్తీకి అంగీకరించార న్నారు. సర్టిఫికేట్స్ లేనివారికి స్కిల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నడిపి వారి స్థానాల్లో వేతనాలు ఇస్తామన్నారన్నారు. హెల్త్ కార్డులు జారీ చేస్తామని చెప్పారన్నారు. రిటైర్ మెంట్ బెనిఫిట్ క్రింద తొలుత రూ.50 వేలు ఇస్తామంటే లక్షకు పెంచమనికోరామని, కానీ మంత్రుల కమిటీ రూ.75 వేలు ప్రకటించిందన్నారు. 10 సంవత్సరాలు క్రైటీరియా పెట్టుకుని రూ. 75 వేలు ఇచ్చేలా ఆపై ప్రతి సంవత్సరం రూ.2 వేలు కల్పి రిటైర్ మెంట్‌కు ఎంతొస్తే అంత ఇస్తామన్నారని తెలిపారు. కార్మికులకు ప్రోత్సాహకంగా ప్రతి సంక్రాంతి పండుగకు ఒక్కో కార్మికునికి రూ. 1000లు ఇస్తామని చెప్పారన్నారు. యూనిఫామ్, చెప్పులు, సబ్బులు ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఇస్తామని కమిటీ ఒప్పుకున్నట్లు వెల్లడించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులు మరణిస్తే ఇప్పటివరకు రూ.15 వేలు ఇచ్చేవారని, ఇప్పుడు రూ.20 వేలకు పెంచాలని ప్రతిపాదించామని, దానికి వారు అంగీకరించినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుకోగలిగామన్నారు. టైం స్కేల్ ఉద్యోగ కార్మికులను, ఎన్ఎంఆర్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరామని, అందుకు వారు అంగీకారం తెలిపారన్నారు. వీటికి సంబంధించి మినిట్స్ ఇస్తామని, ప్రజారోగ్యం దెబ్బతినకుండా కార్మికులకు నష్టం కలుగకుండా సమ్మె కాలపు వేతనం చెల్లిస్తా మని సమ్మె విరమించమని మంత్రుల కమిటీ కోరిందని, దీంతో జేఏసీ నాయకులు చర్చించుకుని పూర్తిగా డిమాండ్స్ నెరవేర్చుకోడానికి ఇచ్చిన హామీల అమలుకై సమ్మె తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు నిర్ణయించామని తెలి పారు. హామీల అమలులో తాత్సారం చేస్తే ఫిబ్రవరి మాసంలో తిరిగి సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమ్మెను విజయవంతంగా నడిపిన నాయకులకు, కార్మికులకు విప్లవాభినందలు తెలియజేశారు.

ఎస్మాతో ఉద్యమాన్ని ఆపలేరు

– సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : ఎస్మా చట్టాన్ని ప్రయోగించి అంగన్‌వాడీల ఉద్యమాన్ని ఆపలేరని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద 31వ రోజు కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె శిబిరాన్ని కోట మాల్యాద్రి గురువారం సందర్శించి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనలో సీపీఐ వారికి అండగా ఉంటుందని అన్నారు. వారికిచ్చిన హామీలనే అమలు చేయాలని వారు కోరుతున్నారే తప్పా గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని అన్నారు. మున్సిపల్ నాయకు లతో చర్చలు జరిపిన విధంగా అంగన్‌వాడీల నాయక త్వంతో కూడా చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్క రించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, జనతాదళ్ జె.సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గనిరాజు, బీఎస్పీ నాయకులు వాసులు పాల్గొన్నారు.

ఫాస్ట్ మూవింగ్ సిటీల్లో జాతీయ స్థాయిలో 2, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 17వ ర్యాంక్ కైవసం చేసుకున్న జీఎంసీ

విశాలాంధ్ర- గుంటూరుకార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లను సాధించిందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఫాస్ట్ మూవింగ్ (వేగంగా అభివృద్ధి చెందుతున్న స్వచ్ఛ నగరాల్లో) సిటీల్లో జాతీయ స్థాయిలో 5 స్టార్ రేటింగ్స్‌తో 2వ ర్యాంక్, స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో 17వ ర్యాంక్ సాధించడం జరిగిందని, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించామని తెలిపారు. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 అవార్డ్‌ల ఫంక్షన్‌లో కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ చేతుల మీదుగా అవార్డ్ లను నగర మేయర్, కమిషనర్లు అందుకున్నారు. మేయర్, కమిషనర్‌లు మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషి, సహకారంతోనే సాధించడం జరిగిందన్నారు. రానున్న కాలంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరింత మెరుగైన ర్యాంక్ సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

విశాలాంధ్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డాక్టర్ బీఆర్ యశ్వంత్ అంబేద్కర్

విశాలాంధ్ర-తాడేపల్లి : తెలుగు జాతీయ దినపత్రిక విశాలాంధ్ర నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి రాజగృహ(అంబేద్కర్ సంస్థానంలో) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు డాక్టర్ బీఆర్ యశ్వంత్ అంబేద్కర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ వాస్తవ సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ మల్టీకలర్ క్యాలెండర్‌ను పాఠకులకు అందించటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, గంజి వెంకటేశ్వరరావు, ఉండవల్లి రాజగృహ నిర్వాహకులు దుంగా రత్నప్రదీప్, కారుమంచి రామారావు, తాడేపల్లి విశాలాంధ్ర విలేకరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ పనులు ప్రారంభించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో జగనన్న పాలవెల్లువ క్రింద పాల సేకరణకు సర్వే పూర్తి చేయడంతో పాటు పాల సేకరణకు భవనాల ఎంపిక పూర్తి కావడంతో ఫిబ్రవరి 1 నుండి పాల సేకరణ పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ నందు జగనన్న పాల వెల్లువ క్రింద పాల సేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1వ తేది నుండి పాల సేకరణ పనులను ప్రారంభించాల్సి వుందన్నారు. క్రొత్తగా విస్తరణ పనులు చేపట్టిన వట్టిచెరుకూరు, కాకుమానులలో కూడా పాల సేకరణకు ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, పశు సంవర్ధక శాఖ జె.డి వెంకటేశ్వర్లు, జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, పాల్గొన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-మంగళగిరి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని నియోజక వర్గ తెలుగు యువత ఆధ్వార్యాన నారా లోకేష్ క్రీడా ప్రాంగణం(భోగి ఎస్టేట్స్)లో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్రీడాకారులు పోటీలు పడి బౌండరీల వర్షం కురిపించడంతో మ్యాచ్‌లు హోరా హోరీగా సాగుతున్నాయి. మూడో రోజైన గురువారం ఉదయం నుంచి సాయంత్ర వరకు 12 జట్ల మధ్య 6 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో యర్రబాలెం నారా లోకేష్ వర్సస్ థండర్స్ (తాడేపల్లి టౌన్) మధ్య జరిగిన మ్యాచ్‌లో థండర్స్ జట్టు విజయం సాధించింది. జీటీ (చినకాకాని) వర్సస్ కొత్తపేట లెవెన్(మంగళగిరి టౌన్) మధ్య జరిగిన మ్యాచ్‌లో కొత్తపేట లెవెన్ జట్టు గెలుపొందింది. ఆర్సీయం యూత్ (ఆత్మకూరు) వర్సెస్ పెనుమాక వారియర్స్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పెను మాక వారియర్స్, ఫ్రెండ్స్ యూత్ నూతక్కి (ఆత్మకూరు) వర్సెస్ కేకే యూత్ (కొలనుకొండ)ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫ్రెండ్ యూత్ నూతక్కి జట్టు, ఉదా వారియర్స్ వర్సస్ డౌన్ గల్లీ యూత్ (మంగళగిరి 13వ వార్డు) మధ్య జరిగిన మ్యాచ్‌లో డౌన్ గల్లీ యూత్, లెజెండ్స్ లెవెన్ వర్సెస్ మినీ వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో లెజెండ్స్ లెవన్ జట్లు విజయం సాధించాయి. కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్ సహకారంతో రూ.రెండు వేల నగదు బహుమతి, ట్రోఫీ, క్రీడాకారులందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. పలువురు టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, ఆయన సతీమణి పుష్ప గురువారం కూడా పూజలు నిర్వహించారు. తెనాలి, బోసురోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో చండీసహిత హనుమదీశ్వర మహాయజ్ఞం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశేషంగా తెనాలి పట్టణంలోని భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు.

జీఎస్టీ అధికారులకు ఎన్నికలపై నిఘా బాధ్యత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు బహుమతుల రూపేణ పంపిణీ చేసే వివిధ రకాల వస్తువులను నియంత్రించేందుకు సెంట్రల్ జీఎస్టీ అధికారులు తమ నిఘాను మరింత పెంచేందుకు కృషి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం కోరింది. ఏపీలోని విశాఖ, గుంటూరు, తిరుపతి, జీఎస్టీ కమిషనర్లకు కేంద్ర ఎన్నికల కమిషనర్ ఈ విషయాన్ని సూచించారు. ఈ నేపథ్యంలో గురువారం జీఎస్టీ సెంట్రల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి బాధ్యతలలో భాగంగా గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, ఎస్పీ ఆరిఫ్‌లను పోలీస్ కార్యాలయంలో కలిశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలుపై చర్చించారు. గుంటూరు జీఎస్టీ కమిషనరేట్ పరిధి గుంటూరు, కృష్ణ, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వరకు విస్తరించి ఉందని, బహుమతులు పేరిట పంచే వస్తువులే కాకుండా పన్ను చెల్లించని అక్రమ వస్తువులు సైతం ఎన్నికల వేళ గోదాముల నుంచి బయటకు వచ్చే అవకాశం ఉందన్నారు. వాటిని స్వాధీనం చేసుకునే క్రమంలో తమ సిబ్బందికి తోడు మరికొంత మంది పోలీస్ స్టాఫ్‌ను తమ శాఖకు కేటాయించాలని పోలీస్ ఉన్నతాధికారులను జీఎస్టీ కమిషనర్ కోరారు. ఎన్నికల వేళ జీఎస్టీ, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలని, పరస్పర సహకారం, సమాచార మార్పిడితో తనిఖీలు చేపట్టే దిశగా ముందుకు సాగాలని అధికారులు నిర్ణయించినట్లు చెప్పారు. ఐజీని, ఎస్పీని కలిసిన వారిలో జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి, జీఎస్టీ అడిషనల్ కమిషనర్ జి.రామకృష్ణ రాజు యాదవ్, జీఎస్టీ నిఘా విభాగం అధికారులు గాదె శ్రీనివాసరెడ్డి, మూర్తి, కాకర్ల శ్రీనివాస్, పాల్గొన్నారు.

220 కోడి కత్తులు స్వాధీనం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నిబంధన లకు విరుద్ధంగా కోడి కత్తులు కలిగి ఉన్న బండి చాలచంద్ర అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి నట్టు నల్లపాడు సీఐ రాంబాబు తెలిపారు. గురు వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గుంటూరు రూరల్ పరిధిలోని ఏటుకూరు బైపాస్ దగ్గరలో ఖాళీ పొలాల్లో బండి చాలచంద్ర అనే వ్యక్తి అనుమానాస్పదముగా తిరుగుతూ ఉండగా పోలీసులు విచారించారు. విచారణలో అతడు వ్యసనాలకు అలవాటుపడి, విలసాలకు డబ్బులు అవసరమయి వచ్చే సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కోడి పందేలు ఆడే వారికి తన వద్ద గల 220 కోడి కత్తులు సానపడుతూ వారికి సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. సంక్రాంతి పండుగా పురస్కరించుకొని ఎవరయినా గుంటూరు రూరల్ పరిధిలో పేకాట, కోడి పందాలు, జూదం, గుండాట మొదలగునవి డబ్బులు పందెముగా పెట్టి ఆడరా దని, ఆడినచో చట్ట ప్రకారం తగు చర్య తీసుకోబడునని సీఐ తెలిపారు.

దివ్యాంగులకు నియామక ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నాల్గవ తరగతి కేటగిరి పోస్టుల క్రింద గుర్తించిన దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఖాళీలలో 13 మంది దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి నియామక ఉత్తర్వులు అందించారు. గురువారం ఉదయం కలెక్టర్ ఛాంబర్ నందు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి నాల్గవ తరగతి కేటగిరి పోస్టులకు సంబంధించి వివిధ శాఖల్లో ఖాళీగా వున్న దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులలో భర్తీ చేసిన 3 మంది దివ్యాంగులకు నియామక ఉత్తర్వులను అందించడం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్ర శేఖర రావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త పాల్గొన్నారు.

రాజుకుంటున్న ఎన్నికల వేడి

విశాలాంధ్ర-తాడికొండ : తాడికొండ నియోజకవర్గంలో ఎన్నికల వేడి రాజుకుంటుంది. రాజకీయ పార్టీలు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు నానా ఆగచాట్లు పడుతున్నారు. సంక్రాంతి అనంతరం ఇక పూర్తిగా ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం అవుతున్నారు. నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసీపీల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఇప్పటికే వైసీపీ నుంచి తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ప్రత్తిపాడు శాసనసభ్యులు మేకతోటి సుచరితను నియమించారు. ఆమె తమ కార్యక్రమాలను చేస్తూ ముందుకు సాగుతున్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెనాలి శ్రావణ్ కుమార్ తన కార్యక్రమాలను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. గతవారం రోజుల క్రితం తాడికొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జనసేన తెలుగుదేశం పార్టీ సమన్వయ సమావేశం జరిగింది. జనసేన, తెలుగుదేశం పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలని తెనాలి శ్రావణ్ కుమార్ సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, కేసులు మొదలైన విషయాలను ప్రజలకు వివరించి తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేయాలని ఆదేశించారు. ఇటీవల బీజేపీ నాలుగు మండలాలకు సంబంధించి పార్టీ అధ్యక్షులను నియమించింది. తాడికొండ మండలంలో వికసిత్ భారత్ పేరుతో తమ కార్యక్రమాలను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. సీపీఐ, సీపీఎం ప్రజా సమస్యలపై ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అలాగే ఆయా మండల కేంద్రాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ దీక్షలకు మద్దతుగా నిలుస్తున్నారు. బీఎస్పీ నాయకులు ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కాలనీలో తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలు మారే పరిస్థితి కనిపించడం లేదు. రాజకీయ పార్టీలు ఎవరు పని వారు చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

జిల్లాలో 46,017 మందికి తోడు పథకం ఋణాలు, వడ్డీజమ : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జగనన్న తోడు పథకం 8వ విడత క్రింద జిల్లాలో 46,017 మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తి దారులకు ఋణాలు, వడ్డీ జమ క్రింద రూ.18,25,00,836 లను లబ్దిదారుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జగనన్న తోడు 8వ విడత రుణ మంజూరు, వడ్డీ రాయితీని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆన్లైన్‌లో బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాలకు జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, శాసనసభ్యులు మద్దాళి గిరిధర్, మహమ్మద్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. అనంతరం నమూనా చెక్కు రూ.18,25,00,836లను లబ్దిదారులకు అందించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, ఎల్.డి.యం మహిపాల్‌రెడ్డి, లబ్దిదారులు పాల్గొన్నారు.

పైపు లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మంగళగిరి వద్ద వున్న ఎయిమ్స్‌కు నీటి సరఫరాకు అవసరమైన పైపు లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పైపు లైన్ పనుల పురోగతిపై కలెక్టర్ ఛాంబర్ నందు రోడ్లు మరియు భవనాలు, పబ్లిక్ హెల్త్ మరియు అటవీ శాఖాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వడ్డేశ్వరం జంక్షన్ నుండి ఎయిమ్స్ ఈస్ట్ గెట్ వరకు పైప్ లైన్ వేయుటకు అటవీ శాఖ క్లియరెన్స్ కు చెల్లించాల్సిన రుసుమును జమ కట్టి పైప్ లైన్ పనులను చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్ర శేఖర రావు, పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్, గుంటూరు అటవీ శాఖ అధికారి మహబూబ్ బాష, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్ సుందర్, ఆర్అండ్‌బి ఈ.ఈ సంపన్నరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులలో ఉపాధ్యాయులను తీసుకునే ప్రక్రియను స్వాగతించిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్‌లో జరగబోవు ఎన్నికలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా టీచర్లను నియమించాలని చీఫ్ ఎలక్షన్ కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లుగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి డాక్టర్ రమేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా రూప కల్పనలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిని వినియోగించడం వలన ఓటర్ల జాబితా లోపభూయిష్టంగా తయారయిందని, అధికార పార్టీ నేతల జోక్యం వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిపై ఎక్కువగా ఉండటం వల్ల అనేక విమర్శలకు తావిచ్చినట్లుందన్నారు. ఎలాంటి అనుభవం లేని సచివాలయ సిబ్బందిని బూత్ లెవెల్ ఆఫీసర్లుగా నియమించడం, వీరు ప్రత్యక్షంగా, పరోక్షంగా అధికార పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావటాన్ని గమనించిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సుప్రీంకోర్టులో ఎన్నికల విధులలో వాలంటీర్లను, సచివాలయ సిబ్బందిని వినియోగించరాదని కోరుతూ పిటీషన్ వేయడం, ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టులో విచారణకి రావడం జరుగుతుందని ఆ ప్రకటనలో వివరించారు. వివిధ రాజకీయ పార్టీలు ఈ సమస్యను చీఫ్ ఎలక్షన్ కమిషన్ బృందానికి తీసుకొని రావడం ద్వారా ఎన్నికల కమిషన్ స్పందించి ఈ నెల 12వ తేదీ లోపు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ వివరాలను ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. భారత ఎన్నికల సంఘం నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య వాదులు స్వాగతించాలని కోరారు. జనవరి 22న విడుదలయ్యే ఓటర్ల జాబితాలో లోపాలను సరిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులకు ఇవ్వాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగే అవకాశం ఉన్న వాలంటీర్లకు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఎలాంటి ఎన్నికల విధులు అప్పగించరాదని సిటిజన్ ఫర్ డెమోక్రసీ గతంలోనే భారత ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల అధికారికి సూచించిందని వారు వెల్లడించారు.

లోకేష్‌ని కలిసిన అగ్రిగోల్డ్ బాధితులు

విశాలాంధ్ర-తాడేపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం రాత్రి తాడేపల్లిలో తటస్తులను కలిశారు. ఈ నేపథ్యంలో అగ్రిగోల్డ్ బాధితులు నారా లోకేష్‌ని కలిసి తమ సమస్యను పరిష్కరిం చాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, కె.భాస్కరరావు, కే శ్రీధర్, కె.షపురి రాయన్న, వి.శ్రీనివాసరావు, శ్రీధర్ రెడ్డి, బి.వి.శ్రీరామ్మూర్తి, వి.ఎస్.ఆర్. తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి లక్ష చెక్కు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు : ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన రాజేష్ అనారోగ్యంతో బాధపడుతూ గత సంవత్సరం అక్టోబర్ నెలలో మరణించారు. కార్పస్ ఫండ్ క్రింద ఒక లక్ష రూ. చెక్కును జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ రాజేష్ సతీమణి జ్యోతికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్న స్వామి, మినిస్టీరియల్ స్టాఫ్ ఇన్‌చార్జ్ ఏఓ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ రమాదేవి, సీఐ వాసు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యరావు పాల్గొన్నారు.

అభ్యర్థులు ఎటువంటి ప్రలోభాలకు లోనుకావొద్దు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని వివిధ కేటగిరి పోస్టుల నియామకాల విషయంలో అభ్యర్థులు ఎటువంటి ప్రలోభాలకు లోనుకావొద్దని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డిఎంహెచ్ఓ)అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ గురువారం సూచించారు. ఎటువంటి పైరవీలను నమ్మొద్దని, నియామక ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డిఎంహెచ్ఓ సూచించారు.

CHANGE OF NAME

I, ACHUTHA SURESH KUMAR (Old Name), S/o. VENKATESWARA RAO, R/o. D.No.21-7-8, Vangavari Veedhi, Chowtra Centre, Guntur, Guntur District - 522003, Andhra Pradesh, have changed my name to ATCHUTA SURESH KUMAR. Hereafter my name is known as ATCHUTA SURESH KUMAR.

బహిరంగ ప్రకటన

నాక్షయింటు అయిన గుంటూరు జిల్లా, అగతవరప్పాడు, రెడ్డి పాలెం, శకుంతలనగర్, 2వ లైన్, తేజశ్విని అపార్టుమెంటు, ఫ్లాట్ నెం.504, డోర్ నెం.131-360, కాపురస్తులైన అలా గోపి, తండ్రి. అలా నాగేశ్వరరావుగారి సంజాయిషిపొంది తెలియచేయునది ఏమనగా, కంకిపాడు సబ్ రిజి స్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.263/2015 మరియు దస్తావేజు నెం.1430/2010గా రిజిష్టరు కాబడిన లింకు దస్తావేజు ద్వారా పెనమలూరు గ్రామపంచాయితీ లోని విక్రయ ఆస్తికి సంబం ధించిన లింకు డాక్యుమెంట్స్ ఒరిజినల్ డాక్యు మెంట్ లింకు దస్తావేజులను ది.03-01-2024న ఫోటోస్టాట్ తీయించుకొను నిమిత్తం పెద కాకాని జిరాక్స్ షాపువద్దనుండి ఇంటికి వచ్చుచుండగా లింక్ దస్తావేజు నెం.263/2015 మరియు దస్తావేజు నెం.1430/2010ను పోగొట్టుకొనియున్నారు. కావున లింక్ దస్తావేజు నెం.263/2015 మరియు దస్తావేజునెం.1430/2010 ఎవరికైన దొరికినచో లేదా తెలిసినయెడల నాక్షయింటు చిరునామాకు గాని అడ్వకేట్ గారికి గాని తెలియజేయగలరు.

రుద్రపాటి రత్నపాల్, అడ్వకేట్ & నోటరీ
లంకావారి వీధి, కొత్తపేట, తెనాలి. సెల్: 9346368595

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ప్రజలు కష్టాలు లేకుండా సంతోషంగా ఉండటమే అసలైన సంక్రాంతి

విశాలాంధ్ర-అమరావతి : ప్రజలు కష్టాలు లేకుండా సంతోషంగా ఉండటమే అసలైన సంక్రాంతి అని పెదకూరపాడుశాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అమరావతిలోని శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వారి సతీమణి నంబూరు వసంతకుమారి పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సంక్రాంతి సందర్భంగా మొదటిసారి నియోజకవర్గంలో సంబరాలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది ఇంతకంటే ఘనంగా సంబరాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. మొదటి బహుమతి కింద లత అనే మహిళ రూ.40 వేలు గెలుచుకున్నారు. రెండో బహుమతి కింద పూజిత రూ.25 వేలు, మూడో బహుమతి కింద లలిత అనే మహిళ రూ.15 వేలు, నాలుగో బహుమతి కింద కొండవీటి సత్యశ్రీ రూ.10 వేలు గెలుచుకున్నారు. ఐదో బహుమతి కింద రాజేశ్వరి రూ.5 వేలు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమాజానికి అధికారులు గైర్హాజరు

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల కేంద్రం లోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్పిటిసి కంకణాల స్వర్ణకుమారి శివాజీ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి అధికారులు నాయకులు ఎందుకు గైర్హాజరవుతున్నారో తెలపాలని ఆమె కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందించాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

పులి సంచరిస్తుందంటూ గ్రామాల్లో అప్రమత్తం

విశాలాంధ్ర-విజయపురిసౌత్: అనుపు-కొప్పునూరు పరిధిలోని మేడిశెల ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. దీనితో కొప్పునూరు, చింతల తండా, అచ్చమ్మ కుంట గ్రామాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని చాటింపు వేశారు. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

బీఎల్వోలను అప్రమత్తంగా ఉంచండి

విశాలాంధ్ర-రొంపిచర్ల : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలకు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార నిమిత్తం వెళ్ళిన ప్రజలు ఆయా రాష్ట్రాలలో జరిగిన ఎన్నిక లలో ఓటు హక్కును వినియోగించుకొని ప్రస్తుతం సంక్రాంతి సెలవులకు ఆంధ్రప్రదేశ్‌కి వచ్చి ఆధార్‌లో అడ్రస్ మార్చుకొని ఆయా జిల్లాల్లో ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకుంటున్నారని వారిలో నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండల వాసులు కూడా ఉన్నారని, అటువంటి వారిపట్ల బీఎల్వోలను అప్రమత్తం చేయాలని రొంపిచర్ల తహశీల్దార్ అంకారావుకు జాతీయ జనసేన పార్టీ రాష్ట్ర రీజియన్ కన్వీనర్ డాక్టర్ గోదా రమేష్ కుమార్ వినతిపత్రాన్ని అందజేశారు. రమేష్ కుమార్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో ఓటు హక్కును వినియోగించు కొని ఆధార్‌లో అడ్రస్ మార్చుకొని సంక్రాంతి పండుగ సెలవులకు ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లోని వివిధ మండలాల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేస్తున్న వారిపట్ల వివిధ రాజకీయ పార్టీల బీఎల్వోలు, ఆయా పోలింగ్ స్టేషన్ పరిధి లోని బీఎల్వోలు అప్రమత్తంగా ఉండే విధంగా ఆదేశాలివ్వాలని తెలిపారు. రాష్ట్రాల నుంచి ఓట్లు భారీగా నమోదవుతున్నాయని సమాచారముందని అన్నారు.

అదనపు కోర్టు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చాగంటి వీరాంజనేయ చౌదరి మరియు కార్యదర్శి కే. హనుమంతరావుల ఆధ్వర్యంలో అదనపు కోర్టు ఏర్పాటు కొరకై స్థానిక ఏజీపీ ఎం.ఎస్.ప్రసాద్, స్థానిక మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కే. చెన్నకేశవ రెడి, న్యాయవాది మహమ్మద్ సయ్యద్ ఖాసింలు, లా సెక్రటరీ జి.సత్య ప్రభాకర్‌రావుని కలిసి మెమొరాండం అందజేశారు. దీనితో పాటు ఈ విషయమై ప్రభుత్వం వైపు నుండి స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అడిషనల్ కోర్టు ఆవశ్యకత, ఏర్పాటు గురించి ఇచ్చిన లేఖను కూడా ఇవ్వటం జరిగింది. ఈ విషయమై ఇటీవల గుంటూరు జిల్లా జడ్జి అదనపు కోర్టు ఆవశ్యకతను రెకమెండ్ చేస్తూ హైకోర్టు పోర్టు పోలియో జడ్జి గారికి రిపోర్ట్ పంపియున్నారు. ఆ తదుపరి పోర్ట్ పోలియో జడ్జికి పంపామన్నారు. దానిపై చర్య తీసుకుని లా సెక్రెటరీకి పంపి ఉన్నారు. లా సెక్రెటరీ ఫైనాన్స్ కమిటీకి పంపించి ఉన్నారు. ఇక ప్రస్తుతం ఫైనాన్స్ కమిటీ దగ్గర కేసు ఫైలు చేరి ఉన్నది. ఈ విషయంలో ప్రభుత్వం వైపు నుండి స్పందన అవసరమై ఉన్నది. అందుకు తగిన రీతిలో సత్వరమే ప్రభుత్వం వైపు నుండి పూర్తి సహాయ సహకారాలు అందే విధంగా చర్యలు తీసుకుంటానని స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారాన్నరు.

మాణిక్యం ఠాగూర్ స్థాయి తెలుసుకుని మాట్లాడాలి

విశాలాంధ్ర-క్రోసూరు : మాణిక్యం ఠాగూర్ స్థాయి తెలుసుకుని మాట్లాడాలని ఆల్ ఇండియా హిందూ వ్యవస్థ అధ్యక్షురాలు సంఘమిత్ర అన్నారు. జగన్ పార్టీ బీజేపీకి బీ టీమంటూ, వైసీపీ ఎంపీలను చీర్ లీడర్స్ అంటూ ఆయన సంబోధించడం సిగ్గుచేట న్నారు. గురువారం క్రోసూరులో ఆమె మాట్లాడుతూ దేశాన్ని దోచుకుంది... దాచుకుంది, తన స్వలాభాల కోసం దేశ శ్రేయస్సును తాకట్టుపెట్టి దేశ విభజన సమయంలో కొన్ని లక్షల ప్రాణాలను తన తప్పుడు నిర్ణయాలతో తీసిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని విమర్శించారు. రాష్ట్ర విభజన చేసి ప్రత్యేక హోదా గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రమ్య చౌదరి, అనంత్, సుభాష్ నాయుడు, తస్లీమా, బేగం ఖలీఫా, యేసు రాణి, మరియ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతమ్స్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-వినుకొండ : పట్టణంలోని సిద్దార్థ నగర్‌లో ఉన్న గీతమ్స్ హై స్కూల్ నందు గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాం డెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరయ్యారు. బాలికలకు తెలుగుదనం ఉట్టిపడేలా రంగురంగుల రంగ వల్లికల పోటీలను నిర్వహించారు. విద్యార్థినిలు తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు చుట్టూ బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణమంతా పండగ వాతావరణాన్ని తలపించారు. మాలపాటి కోటిరెడ్డి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ప్రిన్సిపల్ ఎం. కృష్ణవేణి, ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజేష్‌కు నివాళులర్పించిన కొమ్మాలపాటి

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో కల్లే రాజేష్ గురువారం మరణించిగా వారి నివాసానికి వెళ్లి వారి భౌతికకాయానికి పెదకూరపాడు నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పులమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కారానికి మంత్రుల హామీతో సమ్మె విరమణ

విశాలాంధ్ర-వినుకొండ: మున్సిపల్ కార్మిక నాయకులకు మంత్రివర్గ ఉప సంఘానికి బుధవారం సాయంత్రం జరిగిన చర్చలలో ఒప్పందాలు జరిగిన నేపథ్యంలో మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించడం జరిగిందని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, ఏఐటీయూసీ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావులు అన్నారు. గురువారం నాడు శివయ్య భవనంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 17 రోజులుగా రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం నాడు జరిగిన చర్చలలో కార్మికుల సమస్యలైన హెల్త్ అలవెన్స్ వద్దు కనీస వేతనం కావాలి అన్న నినాదానికి గతంలో ఇచ్చిన 15 వేల రూపాయలకు హెల్త్ అలవెన్స్ 6000 రూ.లు కలిపి మొత్తం 21,000 వేతనంగా ఇస్తామని నిర్ణయించడం జరిగింది. ప్రతి సంక్రాంతికి ఒక్కొక్క కార్మికునకు వెయ్యి రూ. ఇచ్చేలాగున, గ్రాడ్యుటీ పది సంవత్సరాలు నిండిన వారికి 75 వేల రూ. అక్కడి నుండి సర్వీస్ పెరిగే కొద్దీ సంవత్సరానికి 2000 రూపాయల చొప్పున ఎన్ని సంవత్సరాలు సర్వీస్ ఉంటే అన్ని రెండువేల రూపాయలు పెంచి ఇచ్చే లాగున, యాక్సిడెంటల్ బెనిఫిట్‌గా ప్రమాదవశాత్తు జరిగిన వారికి గతంలో ఐదు లక్షల రూపాయలు ఇస్తే ఇప్పుడు అవి 7 లక్షల రూపాయలకు పెంచారు. వచ్చే పీఆర్సీలో ఎంత శాతం పీఆర్సీ పెంచితే అంత శాతం ఈ కాంట్రాక్టు కార్మికులకు 21 వేల రూపాయల వేతనం పై పెంచి ఇస్తారు, కాంట్రాక్టు కార్మికులు మహిళలు, పురుషులకు యూనిఫారం నూతన వస్త్రాలు సబ్బులు నూనెలు అన్ని వెంటనే ఇస్తామని తెలిపారు. డ్యూటీలో ఉండి చనిపోయిన వారికి గతంలో 15000 రూపాయలు మట్టి ఖర్చులు ఇస్తే ఇప్పుడు వాటిని 20వేల రూ.కు పెంచారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్ ఎరండ్ లీవ్ ఎన్కాష్మెంటు చేసుకొనుటకు పది రోజుల్లో వారికి ఏర్పాటు చేయడానికి ఒప్పుకున్నారు. పర్మినెంట్ కార్మికులకు బకాయిపడిన వేతనాలను డీఏలను ఇస్తామని తెలిపారు. హెల్త్‌కార్డులు వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. పీఎఫ్ జీపీఎఫ్‌లో పర్మినెంట్ కార్మికుల ఖాతాల డబ్బుకు సంబంధించిన వివరాలను వెంటనే తెలియజేస్తామన్నారు. ఇంజనీరింగ్ వర్కర్స్ స్కిల్డు, సెమీ స్కిల్డు, హైస్కిల్డ్ వారికి జీవో నెంబర్ 30ని సవరణ చేసి 18500 రూ. వేతనం, 24000 రూ.వేతనం ఇస్తామన్నారు. ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్లో వర్కర్లకు సర్టిఫికెట్ ఉన్నవాళ్ళకు డ్రైవర్లకు హెవీ డ్రైవర్లకు 24000, లైట్ వెహికల్ డ్రైవర్లకు 18500 ఇస్తామని ఒప్పుకున్నారు. అధికారులతో కమిటీ చెప్పిన విధంగా చేస్తామని కార్మిక సంఘాల నేతల మధ్య ఒప్పుకున్న నేపథ్యంలో చర్చలు ఫలప్రదంగా ముగిసినట్టు మంత్రులు కార్మిక నాయకులు తెలిపారు. కార్మికుల సమస్యలపై చర్చలు ఫలప్రద నెగ్గినందుకు వారు హర్ష వ్యక్తం చేశారు. సమావేశంలో కార్మిక నాయ కులు సంపెంగుల అబ్రహం రాజు, శామంతిపూడి సాయి బాబు, రాచపూడి ఏసుపాదం, పచ్చి గోర్ల ఏసు, కంచర్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ అభివృద్దే నా ధ్యేయం.... ఎమ్మెల్యే బొల్లా

విశాలాంధ్ర-వినుకొండ : పదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉండి ఎటువంటి అభివృద్ధి చేయలేని జీవి ఆంజనేయులు నేడు ప్రజల్లోకి వెళ్లి ఓటు వేయమని అడగటం సిగ్గు మాలిన చర్య అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘాటుగా విమర్శించారు. గురువారం సాయంత్రం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు అయిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడారు. ఆనాడు ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు వినకొండకు కాలేజీలంటూ వరాలు గుప్పించాడని. అయితే పదేళ్ళ ఎమ్మెల్యేగా చేసిన జీవి ఒక్క పథకం కానీ ఒక్క అభివృద్ధి కానీ కనీసం త్రాగునీటి సమస్య కూడా తీర్చలేని దద్దమ్మగా నిలిచిపోయాడని ఎమ్మెల్యే బొల్లా ఘాటుగా విమర్శించారు. 2014 ఎన్నికల్లో రైతు రుణమాఫీ చేస్తానని రైతుల్ని ముంచారన్నారు. చంద్రబాబు కేవలం హైదరాబాదులో హైటెక్ సిటీ చూపెడుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 82 సచివాలయాలు. రైతు భరోసా కేంద్రాలు. హెల్త్ సెంటర్స్ ఏర్పాటు చేసి రైతులకు ప్రజలకు విలువైన పాలన అందిస్తున్నామన్నారు. టీడీపీ గ్రామాలలో ప్రతి ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడం ఆనవాయితీగా మారిందని దీనిపై ఈసీకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తాను పదికాలాలపాటు ప్రజలు గుర్తుపెట్టుకునేలా అభివృద్ధి పనులు చేస్తూ ముందుకు సాగుతున్నానని. తన జనని ఫౌండేషన్ ద్వారా గ్రామాలలో ప్రజలకు పండుగ సందర్భంగా చీరల పంపిణీ చేస్తుంటే. జీవి ఆంజనేయులు దీనిని కూడా రాజకీయం చేస్తున్నారన్నారు. సమావేశంలో జెడ్‌పీటీసీ స్వేనాం, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన ప్రసాదరావు అసత్య ప్రకటనలు మానుకోవాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఏపీ భూ హక్కుల చట్టంపై ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అసత్య ప్రకటనలు మానుకోవాలని న్యాయవాది, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశెటి వేణుగోపాల్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక ఏపీ భూహక్కుల చట్టంపై ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఏపీ భూ హక్కుల చట్టాన్ని వెనుకకు తీసుకోమని, చట్టాన్ని చదవని, కొందరు అన్యాయం జరుగుతుందని ఆందోళన చేస్తున్నారని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ఏపీ ప్రభుత్వం తాము చెప్పిన మాటల మీద కట్టుబడి ఉంటే ఈ చట్టం మీద బహిరంగ చర్చకు సిద్ధపడాలని అయన డిమాండ్ చేశారు. నీతిఆయోగ్ ఇచ్చిన నివేదికను అనుసరించి దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే మొదటిసారిగా భూహక్కుల చట్టాన్ని ప్రవేశపెట్టామని, ప్రస్తుతం సివిల్ కోర్టులలో 66 శాతం భూ వివాదాల కేసులే ఉన్నాయని, తద్వారా నేరాల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతుందన్నారు. తాము చేసిన రాజ్యాంగ వ్యతిరేక భూహక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భూ వివాదాలకు రెవెన్యూ అధికారులు చేసే అవగాహన లేని చట్ట వ్యతిరేక చర్యలే కారణమన్నారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు చేసిన భూ సర్వేలలో అనేక అవకతవకలు జరిగి భూ యజమానులు రాష్ట్రంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. భూహక్కుల చట్టం సత్వర న్యాయం అందించడానికే అంటూ ప్రభుత్వ చేస్తున్న వాదనలో పసలేదన్నారు. భూవివాదాలు త్వరితగతిన పరిష్కరించాలనే ఆలోచన ఏపీ ప్రభుత్వానికి ఉంటే రాష్ట్రంలో న్యాయమూర్తులు, కోర్టుల సంఖ్యను పెంచి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. రాజ్యాంగ విరుద్ధమైన భూ హక్కు చట్టాన్ని తక్షణమే ఉపసహరించుకోకపోతే ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

31వ రోజుకు చేరిన అంగన్‌వాడీ దీక్షలు

విశాలాంధ్ర-తాడికొండ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాడికొండ పోలీస్ స్టేషన్ సమీపంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న నిరాహార దీక్ష గురువారానికి 31వ రోజుకు చేరింది. తమ సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించాలని కోరారు. గడచిన 31 రోజులుగా వివిధ రూపాలలో ఆందోళనలు కొనసాగించిన ప్రభుత్వం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి నిర్లక్ష్యం వద్దన్నారు. దీక్షకు టీడీపీ, జనసేన సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, జనసేన నాయకులు జి.నరేష్, టీడీపీ నాయకులు బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల మెరుపు దాడులు

విశాలాంధ్ర-మేడికొండూరు : మండలంలోని గ్రామాలలో గురువారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులతో పాటు సిబ్బంది వినియోగదారుల గృహాలు, వ్యాపార సముదాయాల్లో మెరుపుదాడులు చేశారు. సీఆర్‌డీపీ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజయ్ కుమార్ పర్యవేక్షణలో గుంటూరు విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీఎల్ఎన్ మూర్తి, గుంటూరు టూ టౌన్ డివిజన్ ఆపరేషన్ ఈఈ సిహెచ్ రమేష్ ఆధ్వర్యంలో 18 మంది అధికారులు, 58 మంది సిబ్బంది 32 బృందాలుగా విడిపోయి మండల పరిధిలోని పలు గ్రామాలలో 2173 సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో అక్రమంగా అదనపులోడు వాడుతున్న వారిపై 56 కేసులు నమోదు చేసి రూ.3,25,500లు అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో డోకిపర్రు ఏఈఈ నాగరాజు కుమార్, డివిజన్‌లోని డీఈఈలు, వివిధ మండలాల ఏఈలు పాల్గొన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై 9440812260, 9440812263 నంబర్లకు ఫోన్ గాని వాట్సాప్ ద్వారా గాని సమాచారం ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

ఎస్పీని కలిసిన తెనాలి ఒన్ టౌన్ సీఐ

విశాలాంధ్ర-గుంటూరు : తెనాలి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన దశరథ రామయ్య జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసు స్టేషన్ పరిధిలో ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఐకు సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్న స్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పట్టవా

విశాలాంధ్ర-గుంటూరు : అధికారంలో ఉంటే ప్రజా సేవ, ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తూ టీడీపీ ముందుకు వెళ్తుందని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి సమయం లేకపోవడం దారుణమని అన్నారు. గురువారం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నెల రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె జగన్ రెడ్డికి కనపడటం లేదా అని ప్రశ్నించారు. కనీస వేతనం ఇవ్వాలని, చనిపోయిన అంగన్‌వాడీల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని వారి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు.

రాష్ట్రంలో బూతద్దం వేసి వెతికినా అభివృద్ధి కనిపించదు

విశాలాంధ్ర-వినుకొండ : రాష్ట్రంలో బూతద్దం వేసి వెతికినా అభివృధి అనేది ఎక్కడా కనిపించలేదని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, వినుకొండ మాజీ శాసన సభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో అయన మాట్లాడుతూ పక్క రాష్ట్రం వాళ్ళు ఆంధ్రప్రదేశ్‌ని చూసి జాలి పడుతున్నారని జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని యువతకు ఉద్యోగాలులేక లక్షల్లో నిరుద్యోగులు పెరిగిపోతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామిలలో 90 శాతం పూర్తిగా వైసీపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అని ఎద్దేవ చేసారు. చంద్రబాబు నాయుడు రా కదిలిరా సబలకు ప్రజలు తండోప తండాలుగా వస్తున్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే రాష్ట్రం బాగుంటుందని ప్రజల్లో మార్పు వచిందన్నారు. టీడీపీ, జనసేన కలిసి సంయుక్త ప్రభుత్వం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన 165 సీట్లు సాదిస్తుందని నియంత పాలనతో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసారని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో డబల్ ఎంట్రీ ఓట్లు పది వేల నుండి 12 వేల దాక ఉన్నాయని అధికారులను ఒత్తిడి చేసి దొంగ ఓట్లు తీసివేయ కుండ వైసీపీ వారు అడ్డుకుంటున్నారు. అని విమర్శించారు. టీడీపీ జనసేన సానుభూతి పరుల ఓట్లు వేలకు వేలు తొలిగించే ప్రయత్నం చేస్తున్నారు. బొల్లా బ్రహ్మనాయుడు ఓటమి బయంతోనే దొంగ ఓట్లు చేరుస్తున్నారని ఇలాంటి ఓట్లను వెంటనే తొలగించాలని ఎన్నికల కమిషన్‌ని కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ సీనియర్ నాయకులు లగడపాటి వెంకటరావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు పి.అయూబ్ ఖాన్, మురళి కృష్ణ యాదవ్, రాపర్ల జగ్గారావు పాల్గొన్నారు.

కన్నాపై అవాకులు చవాకులు పేలితే సహించం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : కన్నా లక్ష్మీనారాయణపై మంత్రి అంబటి రాంబాబు అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని టీడీపీ నాయకులు బత్తుల ఆదినారాయణ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో గురువారం టీడీపీ లీగల్ సెల్, ఎస్సీ సెల్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదినారాయణ మాట్లాడుతూ అంబటి తనకు టిక్కెట్ రాదనే అభద్రతా భావంతో కన్నా లక్ష్మీనారాయణపై సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లీగల్ సెల్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ వినోదం పేరుతో చట్ట విరుద్ధమైన లాటరీ టిక్కెట్లను అమ్మించటం నేరమా కాదా అని ప్రశ్నించారు. ఎస్సీ సెల్ నాయకులు బొక్క సంగీతరావు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే దాని తాలూకు ప్రభుత్వం అందించే నష్ట పరిహారంలో సగం వాటా అడిగిన నీవా కన్నా లక్ష్మీనారాయణ గురించి మాట్లాడేది అంటూ అంబటిని విమర్శించారు. ఆ నైతికత అంబటికి లేదని అన్నారు. సమావేశంలో అనుమోలు జయరాం, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో ముగిసిన క్రీడోత్సవాలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండలం ఆత్మకూరు పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజనోత్స వాలలో భాగంగా నిర్మల ప్లే ఆఫ్-2024 క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయని నిర్మల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాములరెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి సంవ త్సరం మూడు రోజులపాటు విద్యార్థుల మానసిక ఉల్లాసం పెంపొందించడం కోసం క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా డీజీపీ కార్యాలయం డీఎస్పీ డి.వెంకటేశ్వరరావు, సీఐ వాసు విచ్చేసారని కార్యదర్శి నిర్మాల జ్యోతి తెలియజేశారు. క్రీడోత్సవాలలో భాగంగా రన్నింగ్, క్రికెట్, పుస్తక అన్వేషణ, త్రో బాల్, షటిల్, క్యారమ్స్, కోకో, క్విజ్, షాట్ పుట్ తదితర క్రీడలు నిర్వహించామని, విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీని ముగింపు సభలో కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ శౌరీలు చేతుల మీదుగా అందజేసినట్లు చెప్పారు. క్రీడా పోటీల సమన్వయకర్తలు డాక్టర్ వినయ్ కుమార్, జోజి బాబు, డాక్టర్ సౌజన్య, శ్రీ రత్న మంజుల తెలిపారు. జాతీయ సేవ పథకం వలంటీర్లు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన ఆకుల

విశాలాంధ్ర-సత్తెనపల్లి : పట్టణంలోని 31వ వార్డుకు చెందిన ఆకుల రామారావు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం వైసీపీ కార్యాల యంలో రామారావుకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్వయంగా పార్టీ కండువా కప్పి వారిని సాధరంగా ఆహ్వానించారు. ఇటీవల వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన ఆకుల హనుమంతరావుకి రామారావు స్వయానా సోదరుడు కావడం విశేషం. రామారావు కంటే ఒక్కరోజు ముందుగానే వారి చిన్న సోదరుడు శివశంకర్ వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సోదరులైన శివశంకర్, రామారావులు ఇద్దరు సమన్వయంతో స్థానిక నాయకులతో కలిసి వార్డు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, ఆకుల శివయ్య, తోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీలకు సీట్లు కేటాయించండి

విశాలాంధ్ర-గుంటూరు : రానున్న 2024 ఎన్నికలలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా క్రిస్టియన్ మైనారిటీలకు అవకాశం కల్పించాలని వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం, అవర్ స్టేట్ అవర్ లీడర్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఇటీవల ఒక బహిరంగ లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా క్రిస్టియన్ మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలోనైనా ప్రస్తుత రాజకీయాలలో వారికి క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం కల్పించాలని కోరారు. క్రిస్టియన్ మైనారిటీలకు సీట్లు కేటాయించడం ద్వారా సామాజిక సాధికారత వైసీపీతోనే సాధ్యమని రుజువుచేసినట్లు అవుతుందని తెలిపారు. దీనిపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

తాడిబోయినను పరామర్శించిన డేగల ప్రభాకర్

విశాలాంధ్ర-గుంటూరు : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన పాత గుంటూరు 4వ డివిజన్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాడిబోయిన కటంరాజును గురువారం పరామర్శించి వారి కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో కొండెపు శేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు సుబ్బారావు, షేక్ నియాజ్, నల్లమేకల శంకర్ ఉన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర-తెనాలి : అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం స్పందన లేకపోవడం శోచనీయమని ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని ప్రజాస్వామ్య పరిరక్షన ఐక్య వేదిక నాయకులు శివకృష్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమారి, పావని, విజయలక్ష్మి, నగరాజకుమారి, హసీనాబేగం, వహించారు.

మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేత

విశాలాంధ్ర-నూజెండ్ల : మండలంలోని ములకలూరు గ్రామంలో గుండె పోటుతో మందా ఏసు రత్నం మరణించారు. ఏసురత్నం వైఎస్సార్ బీమాలో నమోదై ఉండడం వల్ల భార్య మరియకుమారికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను సర్పంచ్ కంచర్ల బాబు అందజేశారు. సర్పంచ్‌తో పాటు గ్రామ పార్టీ అధ్యక్షులు వంగవల్లు వెంకట్రావు, వెల్ఫేర్ అసిస్టెంట్ హరేంద్ర కుమార్, కంచర్ల భాస్కర్ రావు, యరబిక్కి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డు పాట రూ.12,500లు

విశాలాంధ్ర-రెంటచింతల: రెంటచింతలలో 9 రోజులుగా జరుగుతున్న లక్ష్మీ నరసింహస్వామి హోమం ఘనంగా గురువారం ముగిసింది. వంద లాది భక్తుల సమక్షంలో నిత్యం వేద పండితులు విజయమోహన్ శర్మ హోమం కొనసాగించారు. గురువారం 5 కిలోల లడ్డు, 20 గ్రాముల వెండి గొలుసురు వేలంపాట నిర్వహించగా రాచ మరుగు నాగేశ్వరరావు రూ. 12,500లకు దక్కించుకున్నారు. నిత్యం స్వామి పొంగలి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్చూరి రాముడు, గుంటక కాశిరెడ్డి నాళం బాబు, శివ, బొడ్డుపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడలపై ఆసక్తి

విశాలాంధ్ర-దుర్గి : యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయాలన్న ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ అన్నారు. దుర్గిలోని లూథరన్ చర్చి ఆవరణలో గురువారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను ప్రారంభించారు. దీనిలో భాగంగా వాలీబాల్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. సచివాలయాల స్థాయిలో గెలుపొందిన టీములు మండల స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ వెలిదండి గోపాల్, జడ్పీటీసీ శెట్టిపల్లి యల్లమంద, సర్పంచ్ మాణిక్యం, పీఈటీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

24న పెదకూరపాడులో జయహో బీసీ మహాసభ

విశాలాంధ్ర-పెదకూరపాడు : వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయమే తప్ప ఎటువంటి ప్రయోజనం వనకూరలేదని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అర్తిమళ్ళ రమేష్ ధ్వజమెత్తారు. పెదకూరపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం పెదకూరపాడు మండల టీడీపీ బీసీ సంఘ నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. ఈ నెల 24వ తేదీన పెదకూరపాడులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో జయహో బీసీ మహాసభ జరుగనుందని, మండల వ్యాప్తంగా బీసీలు పెద్దసంఖ్యలో పాల్గొని తమ సమస్యలపై గళమెత్తాలని అన్నారు. ఈ సందర్భంగా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక రాక్షస పాలన సాగుతుందని, వైసీపీ నాయకులకు తప్ప ఎవరికీ స్వేచ్ఛ లేదని ఆరోపించారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన కమిటీ సభ్యులు మోదుగుల చంద్రశేఖరు, మండల బీసీ సెల్ అధ్యక్షులు కోరంపల్లి నరేంద్రబాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షుడు మిలిటరీ మౌలాలి, జిల్లా కార్యవర్గ కార్యదర్శి ముంతాజ్, ముసాపురం పార్టీ ప్రెసిడెంట్ బత్తుల రమేష్, బత్తుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాఖ గ్రంథాలయంలో గ్రూప్-2 సిలబస్ పుస్తకాలు

విశాలాంధ్ర-అమరావతి : గ్రూప్-2కు సంబంధించిన విద్యార్థుల కోసం గ్రూప్-2 సిలబస్ మెటీరియల్‌ను అమరావతి శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసినట్లు అమరావతి శాఖ గ్రంథాలయ ఇన్‌చార్జ్ ఎం.వెంకాయమ్మ తెలిపారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ అవసరమైన విద్యార్థులు శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సిలబస్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గుల పోటీల ప్రాంగణాన్ని పరిశీలించిన ఎంపీపీ

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసిన ప్రాంగణాన్ని ఎంపీపీ బెల్లం కొండ మీరయ్య పరిశీలించారు. మండల వ్యాప్తంగా సుమారు 500 మంది మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొంటున్నారన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు ఆధ్వర్యంలో మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేస్తారని ఆయన తెలిపారు. ముగ్గులు పోటీలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలకు ఎంపీపీ ఆల్ ద బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి శివాజీ, మండల కన్వీనర్ షేక్ షరీఫ్, వైస్ ఎంపీపీ భాష, కంచర్ల అచ్యుతరావ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర శ్రీ కళానిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-తెనాలి : మండల కేంద్రం కొల్లిపరలో శ్రీ కళానిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఈ నెల 14వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరుగుతాయని శ్రీ కళానిలయం ప్రధాన కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. గురువారం తెనాలి గాంధీనగర్ ఇస్కఫ్ కార్యాల యంలో ప్రభాకర్‌రెడ్డి కార్యక్రమాలను వివరించారు. కొల్లిపర అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో భాగంగా 2022- 2023వ సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. సంక్రాం తికి కొల్లిపర మండల పరిధిలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రంగవల్లులు పోటీలో పాల్గొన దలచిన మహిళలు 15వ తేదీ ఉదయం 10గంటల లోపు కొల్లిపరలోని శ్రీ కళా నిలయం కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. 14వ తేదీనుండి 17వ తేదీ వరకు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సాంస్కృతిక కార్యాక్రమాల్లో ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన నాటికలు, నాటకాలుప్రదర్శిస్తారన్నారు. కూచిపూడి భరతనాట్యం, జానపద నృత్యాలు, సంగీత విభావరి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

Order 21 Rule 34 Notice

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P No:25/2022 in O.S No:10/2019

బిట్వీన్:
తియ్యగూర కోటి రెడ్డి ...డి.హెచ్.ఆర్.
మరియు
మందలపు కృష్ణకుమారి ....జె.డి.ఆర్.

టు, మందలపు కృష్ణకుమారి, భర్త. సత్య నారాయణ, నివాస డోర్ నెం:13-1-366/1, బ్లాక్ నెం:13, మాచర్ల టౌన్ & మండలం, గుంటూరు జిల్లా, ప్రస్తుతం పల్నాడు జిల్లా.

పై నెంబరు అమలు పిటీషనులో జె.డి.ఆర్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఆర్డరు 21 రూలు 34 నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 21-02-2024న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టువారి ఎదుట మీరు స్వయంగా కాని, మీ తరపు అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ : 21-02-2024

జక్కా చెన్నకేశవ రావు,, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, గురజాల, పల్నాడు జిల్లా, సెల్: 98851 34858